23 తారీఖొచ్చినా జీతాలు పడలే!

- ఉద్యోగులకు ఫస్ట్‌కే జీతం ఉత్తమాటే
- సెర్ప్, ఉపాధి హామీ సిబ్బందికి అందని జీతాలు
- 34 వేల మంది వేతనజీవుల ఎదురుచూపులు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ రాజ్యంలో ఉద్యోగులకు ఫస్ట్ తారీఖునాడే జీతాలు ఇస్తామంటూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు చెప్పుకుంటూ వచ్చారు. ఫస్ట్ నాడు దేవుడెరుగు కనీసం 23వ తేదీ నాటికి కూడా వేతనాలు అందక ఉద్యోగులు అల్లాడుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖలోని గ్రామీణ ఉపాధి హామీ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు, ఉద్యోగులు, వీవోఏలకు ఇంకా వేతనాలు అందలేదు. ఈ రెండు సంస్థల్లో 34 వేల మంది ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. డిసెంబర్‌కు సంబంధించి జనవరి 1న వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులందరికీ మొదటి వారంలోనే వేతనాలు అందించామంటూ ప్రకటించుకొన్న ప్రభుత్వం ఆయా శాఖల్లో పనిచేస్తున్న వేలాది మంది అధికారులు, ఉద్యోగులకు వేతనాలు వెయ్యలేదు. సంక్రాంతి పండుగకైనా వేతనాలు వస్తాయేమోనని ఎదురుచూసిన వారికి నిరాశే మిగిలింది. సంక్రాంతి అయిపోయినా కూడా ఇంత వరకు జీతం జమకాలేదు. గ్రామీణ ఉపాధి హామీలో 12 వేల మంది, సెర్ప్‌లో 17 వేల మంది వీవోఏలు, సెర్ప్‌లో దాదాపుగా 5 వేల మందికి నేటికి వేతనాలు అందలేదు. ఆయా విభాగాల్లో పనిచేసే అధికారులు సైతం ఇదే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాల కోసం తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించాల్సి ఉన్నదని, వేతనాలు ఆలస్యం కావడంతో సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో.. అదిగో.. వేతనాలు వస్తున్నాయంటూ కబుర్లు చెప్తున్నారే తప్ప అందించడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి 45 రోజులైనా తమ బాధలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

నామినేటెడ్ పోస్టులు మాకెందుకివ్వరు?

- మహిళా కాంగ్రెస్ నేతల డిమాండ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పోస్టుల భర్తీలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. పోస్టుల భర్తీలో తమ పేర్లను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మహిళా ఓటర్లు కారణమని, అందుకు కృషి చేసిన మహిళా నేతలకు నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టంచేస్తున్నారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు అధ్యక్షతన గాంధీభవన్‌లో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన మహిళా నేతలందరికీ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులతో సహా ఆఫీస్ బేరర్స్ అందరి నుంచి దరఖాస్తులు తీసుకొని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అందజేసినట్టు చెప్పారు. సమావేశంలో ఏఐసీసీ మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ హసీనా, ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మధ్య 'పరిరక్షణ రిజర్వ్'

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పులులు, ఇతర వన్యప్రాణుల మరణాలు పెరుగుతుండటంతో ఆందోళన చెందిన తెలంగాణ అటవీశాఖ.. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలో దాదాపు 1400 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పరిరక్షణ రిజర్వ్‌గా ప్రకటించాలని భావిస్తున్నది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించిన అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది. అటవీ శాఖ ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే రాష్ట్రంలో ఇదే మొదటి పరిరక్షణ రిజర్వ్ అవుతుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో దాదాపు 30 నుంచి 40 వరకు పరిరక్షణ రిజర్వ్‌లు ఉన్నాయి. వేటగాళ్లపై చట్టబద్ధంగా కఠిన చర్యలను ప్రారంభించడంతో పాటు, రిజర్వ్ ప్రాంతంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించడాన్ని నిరోధించడం, కఠినమైన నిఘాను పెంచడం పరిరక్షణ రిజర్వ్‌ను ప్రకటించడం వెనుక ప్రధాన లక్ష్యం. వన్యప్రాణుల రక్షణ చర్యల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను కూడా పెద్ద ఎత్తున రాబట్టవచ్చు.

చేయూతకు చెయ్యిచ్చారు!

- రెండో నెలలోనూ పాత పింఛనే
- 4వేల పింఛన్ హామీ ఉత్తమాటే
- 45 రోజులు గడిచినా 'చేయూత'పై నో క్లారిటీ
- రాహుల్‌గాంధీ ప్రకటించిన హామీకే తెలంగాణలో నో గ్యారెంటీ
- ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): 'అమ్మా... పింఛన్ ఎంత వస్తుంది? రెండు వేలే కదా? (రెండు వేళ్లు) చూపెడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నాలుగు వేలు (నాలుగు వేళ్లు చూపుతూ) వస్తుంది.. డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది.. వెంటనే నాలుగు వేలు మీ అకౌంట్‌లో పడ్తాయి. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఇచ్చే నాలుగు వేల పింఛను కావాలా? కేసీఆర్ ఇచ్చే రెండు వేల పింఛను కావాలో ఆలోచించుకొని ఓటు వేయండి' ఇవీ పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లో చెప్పిన మాటలు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 45 రోజులు గడుస్తున్నా ఆ హామీ నీటిమూటే అయ్యింది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు పింఛన్ పెంపుపై పెదవి కదపడం లేదు. ఈ పథకం అమలు చేయడానికి పెద్దగా అధికారిక ప్రక్రియ కూడా చేయాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఉన్న లబ్ధిదారులకు ఇచ్చే మొత్తాన్ని పెంచుతూ జీవో ఇస్తే సరిపోతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. ఆలోచన కూడా చేయలేదు. ఇప్పటివరకూ ఒక్కసారి కూడా చేయూత పింఛన్‌పై సమీక్ష చేయలేదు. వాటికి ఎంత మొత్తం అవుతుంది? ఎప్పటి నుంచి అమలు చేయాలి? అనే దానిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు కనీసస్థాయిలో కూడా ఆలోచన కూడా చేసిన పాపానపోలేదు. గత నెలలో చేయూత పథకం కింద రూ.2016 చెల్లించారు. ఈ నెలలో కూడా రూ.2016 మొత్తాన్నే ఇవ్వాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దానికి అవసరమైన మొత్తాన్ని జిల్లాలకు జమ చేయడం ప్రారంభించారు.

మండిపడుతున్న లబ్ధిదారులు

రాష్ట్రంలో మొత్తం 45 లక్షల మంది పింఛన్‌దారులున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బోధకాలు బాధితులు, బీడీ కార్మికులు, చేనేత, గౌడ వృత్తిదారులు, దివ్యాంగులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల నుంచి పింఛన్ పెంచి ఇస్తారని ఆశలు పెట్టుకున్నారు. అయితే, కాంగ్రెస్ సర్కారు పాత పింఛనే ఇస్తున్నట్టు తెలియడంతో అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో చెప్పిందేమిటి? ఇప్పుడు చేస్తున్నదేమిటి? అని కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్నారు. వచ్చే నెలలో ఏ రోజైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, అప్పుడు పెంచిన మొత్తం ఇవ్వడం కష్టమని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రూ.4 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

స్వయంగా రాహుల్‌గాంధీ ప్రకటించినా..

కాంగ్రెస్ ప్రభుత్వం అసరా పథకాన్ని 'చేయూత'గా మార్చి రూ.2016 మొత్తాన్ని రూ.4వేలు చేస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని మొదటి సారిగా 2023 జూలై 2న ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు వేలు ఇస్తామంటూ చెప్పారు. దానికి సంబంధించిన ప్రచార పత్రాన్ని రాహుల్ ఆ సభలో ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ప్రజలు వారికి ఓటు వేశారు. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 45 రోజులు పూర్తయ్యింది. డిసెంబర్‌లో 'చేయూత' పింఛను పాత మొత్తాన్నే అందించారు. తాజాగా జనవరి మొత్తాన్ని దశలవారీగా నిధులను విడుదల చేయడం ప్రారంభించారు. ఈ నెల గతంలో ఇచ్చిన మాదిరిగానే రూ.2016 ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్టుగానే రూ.2016 చెల్లించడానికి అవసరమైన నిధులనే విడుదల చేశారు. ప్రభుత్వం నుంచి చేయూత పింఛను మొత్తాన్ని పెంచాలని ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు పాత మొత్తానికి సంబంధించిన నిధులను జిల్లాలకు విడుదల చేయడం ప్రారంభించామని చెప్తున్నారు.



ఉచిత బస్సులో బీడీలు చుట్టిన మహిళలు

- సోషల్ మీడియాలో వీడియో

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నది. ఇప్పటివరకూ విపరీతంగా ఈ సదుపాయాన్ని వినియోగించుకున్న మహిళలు ఇప్పుడు సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు. బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలు బీడీలు చుడుతూ కనిపించారు. ఈ ఘటనను కెమెరాలో బంధించిన ఒకరు సోషల్ మీడియాలో పెట్టగా, వైరల్‌గా మారింది. వీడియో కింద నెటిజన్లు ఫన్నీ కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఇదంతా కాంగ్రెస్ తీసుకొచ్చిన ఫ్రీ బస్ ఎఫెక్ట్ అంటూ చురకలంటిస్తున్నారు.

50 కోట్లతో పాత అసెంబ్లీ, జూబ్లీహాల్ పునరుద్ధరణ!

- ఉత్తమ పర్యాటక ప్రాంతంగా అసెంబ్లీ ప్రాంగణం
- లండన్ కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో పనుల నిర్వహణ
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆర్అండ్‌బీ

హైదరాబాద్, జనవరి 23(నమస్తే తెలంగాణ): పాత అసెంబ్లీ భవనంతోపాటు జూబ్లీ హాలును పునరుద్ధరించే ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్ నుంచి లలితకళాతోరణం వరకు సుందరీకరించి అసెంబ్లీ ప్రాంగణాన్ని ఉత్తమ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పనుల కోసం రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించిన ఆర్అండ్‌బీ శాఖ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసింది. ఒకటి రెండు రోజుల్లోనే నిధులు విడుదల అయ్యే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. పాత అసెంబ్లీ భవనంతోపాటు జూబ్లీహాలు వాసరత్వ కట్టడాలు కావడంతో వాటిని వినియోగంలోకి తేవాలంటే వాటిని చెక్కుచెదరకుండా పరిరక్షించడంతోపాటు పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నది. ఈ నేపథ్యంలో వారసత్వ కట్టడాల పరిక్షణలో అనుభవం ఉన్న లండన్‌కు చెందిన నిపుణులను ప్రభుత్వం రప్పించింది. ఈ బృందం సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని పాత అసెంబ్లీ భవనం, జూబ్లీహాలుతోపాటు పబ్లిక్ గార్డెన్స్‌లో చేపట్టాల్సిన సుందరీకరణ పనులకు సంబంధించిన వివిధ నమూనాలను పరిశీలించింది. ప్రస్తుతం వాసరత్వ భవనంగా ఉన్న పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరించి అందులో శాసనమండలి కార్యకలాపాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం మండలి కొనసాగుతున్న భవనాన్ని సెంట్రల్‌హాలుగా వినియోగించాలని, ప్రస్తుతం ఉన్న సీఎల్‌పీ, ఇతర ఫ్లోర్‌లీడర్ల కార్యాలయాలను తొలగించి ప్రాంగణంలో చివర నిర్మించాలని నిర్ణయించారు. కొత్త భవనాల నిర్మాణం పూర్తయ్యేవరకు వాటిని అసెంబ్లీలోని పై అంతస్తులో సర్దుబాటు చేయనున్నారు.

యథావిధిగానే వచ్చే బడ్జెట్ సమావేశాలు

వాస్తవానికి ఫిబ్రవరిలో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా ఈ పనులన్నీ పూర్తిచేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ అది సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు. ఇప్పటివరకు పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభంకాలేదు. కాబట్టి ఈసారికి ప్రస్తుతం కొనసాగుతున్న భవనాల్లోనే శాసనసభ, శాసనమండలి సమావేశాలు నిర్వహించనున్నారు.

రహదారుల వెంట రోడ్ సేఫ్టీ క్లబ్బులు

- జిల్లాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ బ్యూరోలు
- చలాన్ల సొమ్ముతో స్పీడ్‌గన్లు, బ్రీత్ అనలైజర్ల కొనుగోలు
- ప్రమాదాల నివారణకు కార్యాచరణ
- సమీక్షలో డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీజీపీ రవిగుప్తా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రత, రైల్వేల విభాగం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లలో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని రహదారుల వెంట రోడ్ సేఫ్టీ క్లబ్బులు ఏర్పాటు చేయాలని, జిల్లాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ బ్యూరో, కమిషనరేట్ల పరిధిలో కమిషనరేట్ రోడ్ సేఫ్టీ బ్యూరోలను తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ చెప్పారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రతా మాసంగా పాటిస్తున్నదని, ఈ నెల రోజులు విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా యువత చనిపోతున్నందున ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ విభాగాల ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని సూచించారు. వాహనాల సంఖ్య పెరుగుతుండటం, వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదని చెప్పారు. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, అతి వేగం, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నాయని వివరించారు. ఈ-చలాన్ల ద్వారా వచ్చే నిధులతో స్పీడ్ గన్లు, బ్రీత్ అనలైజర్ల వంటి పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో బాధితుల ప్రాణాలను కాపాడే వారిని 'గుడ్ సమారిటన్' పేరిట సన్మానించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బుద్ధప్రకాశ్, రోడ్డు భద్రత అడిషనల్ డీజీపీ మహేశ్ భాగవత్, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఐజీ రంగనాథ్, రోడ్ సేఫ్టీ ఎస్పీ సందీప్ పాల్గొన్నారు.

నేడు కలెక్టర్లతో ధరణి కమిటీ భేటీ

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ధరణి పునర్నిర్మాణ కమిటీ బుధవారం సచివాలయంలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నది. సిద్దిపేట, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్ జిల్లాల కలెక్టర్లను హాజరు కావాల్సిందిగా ఇప్పటికే సమాచారం పంపింది. ధరణి సమస్యలు, వాటి పరిష్కారానికి సలహాలు, తహసీల్దార్లు, ఆర్డీవోలు దర్యాప్తు నివేదికలు ఇచ్చే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, పోర్టల్‌లో ఆర్డీవో, తహసీల్దార్లకు అదనంగా కల్పించాల్సిన వెసులుబాట్లు, న్యాయ సంబంధ సమస్యలు, చేయాల్సిన మార్పులు, చేర్పులు, నిజామాబాద్ జిల్లాలో భూభారతి వివరాలతో రావాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ల నివేదికలను పరిశీలించిన అనంతరం ఎంపిక చేసిన ప్రాంతాలకు వెళ్లి భూ సమస్యలను అధ్యయనం చేయాలని ధరణి కమిటీ భావిస్తున్నది.

రెవెన్యూ శాఖ మంత్రితో సమావేశం

ధరణి కమిటీ మంగళవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో సమావేశమైంది. ఇప్పటివరకు వివరాలను సభ్యులు మంత్రికి వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లోగా ప్రభుత్వానికి ఒక మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించిన విషయాన్ని మంత్రికి వివరించినట్టు తెలిసింది.

ఎంపీ రంజిత్‌రెడ్డిపై కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 23: మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి దుర్భాషలాడిన ఘటనలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో వివిధ పార్టీల నాయకులతో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది సర్పంచ్‌లు, నాయకులను పిలిపించుకొన్నారు. ఈ విషయం తెలుసుకొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి ఈ నెల 17న విశ్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి నిలదీశారు. తనమీద అభ్యంతరకరమైన రీతిలో మాట్లాడిన రంజిత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని 20న విశ్వేశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి తీసుకొన్న బంజారాహిల్స్ పోలీసులు రంజిత్‌రెడ్డిపై ఐపీసీ 504 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ఇవ్వండి

- సీఎం రేవంత్‌ను కోరిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు
- గన్‌మెన్ల కుదింపు, ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- అంతకుముందు ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డికి వినతి

హైదరాబాద్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) ఇవ్వాలని ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎఫ్‌తోపాటు ప్రొటోకాల్ ఉల్లంఘన, గన్‌మెన్ల కుదింపు తదితర అంశాలను సీఎం దృష్టికి తీసికెళ్లినట్టు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఎస్‌డీఎఫ్ అర్ధాంతరంగా నిలిపివేయడం వల్ల అభివృద్ధి పనులు జరగడం లేదని పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా తమను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. సీఎంను కలిసిన వారిలో తనతోపాటు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉన్నారని చెప్పారు. అంతకుముందు గన్‌మెన్ల కుదింపు అంశాన్ని ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డిని కలిసి వివరించినట్టు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సోమవారం కలిసినట్టు వివరించారు.

అభివృద్ధికి సహకరించాలని కోరాం: గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాము సీఎం కలిసిన అంశాన్ని రాజకీయం చేయవద్దని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీని సీఎం రేవంత్‌రెడ్డి ఎలా కలిశారో, తాము అలానే కలిశామని స్పష్టంచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో మెదక్ ఎంపీ స్థానంలో గులాబీ జెండా ఎగురవేస్తామని మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.

26 వేల స్వచ్ఛ కార్మికులను నియమించొచ్చు

- 18 వేల విద్యా వలంటీర్, 5 వేల పీటీఐలకు ఉపాధి చూపొచ్చు
- సీఎం రేవంత్‌కు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం వినతి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న కొన్ని పోస్టుల వివరాలను రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం మంగళవారం ఓ ప్రకటనలో విడుదల చేసింది. మూతబడిన పాఠశాలలను తిరిగి తెరవాలని సీఎం యోచించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికుల నియామకాన్ని పునరుద్ధరించడం ద్వారా 26,065 మందికి ఉద్యోగాలు కల్పించవచ్చని తెలిపారు. విద్యా వలంటీర్లను నియమించడం ద్వారా 18,000 మందికి, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను నియమించడం ద్వారా 5000 మందికి ఉపాధి చూపవచ్చని పేర్కొన్నారు. 1,817 స్కూల్ కాంప్లెక్స్‌లకు ఒక కంప్యూటర్ ఆపరేటర్ కం క్లర్క్ నియామకాలు చేపట్టాలని, సీఆర్పీలు లేని స్కూల్ కాంప్లెక్స్‌ల్లో వారిని నియమించాలని కోరారు. గత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన 148 మండలాల్లో ఎంఐఎస్, సీసీవో, మెసెంజర్, ఐఈఆర్పీలను నియమించాలని కోరారు. కుకింగ్, గుడ్డు ధరలను సవరిస్తూ మధ్యాహ్న భోజన నిర్వాహకుల బిల్లులు వెంటనే గ్రీన్ చానల్ ద్వారా చెల్లించాలని విజ్ఞప్తిచేశారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్తు, ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్లు, ఫర్నిచర్, బోధనేతర సిబ్బంది నియామకం వంటి వాటిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బయో ఏషియా భాగస్వామిగా ఫ్లాండర్స్

- మంత్రి శ్రీధర్‌బాబు హర్షం

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే నెల 26 నుంచి 28 వరకు 21వ వార్షిక సదస్సును నిర్వహించనున్న బయో ఏషియా.. బెల్జియంలోని ఫ్లాండర్స్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ (ఎఫ్ఐటీ) రీజియన్‌ను తమ అంతర్జాతీయ ప్రాంతీయ భాగస్వామిగా ప్రకటించింది. లైఫ్‌సైన్సెస్ రంగంలో భారత్-బెల్జియం మధ్య వాణిజ్యాభివృద్ధికి ఈ భాగస్వామ్యం ఎంతో దోహదపడుతుందని బయోఏషియా-2024 నిర్వాహకులు తెలిపారు. ఎఫ్ఐటీని బయో ఏషియా అంతర్జాతీయ ప్రాంతీయ భాగస్వామిగా ప్రకటించడంపై రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లైఫ్‌సైన్సెస్ రంగం అభివృద్ధికి దోహదపడటంతో పాటు శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలకు ఫ్లాండర్స్ తోడ్పాటును అందిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నకిలీ విత్తన విక్రేతల కదలికలపై నిఘా

- విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే పలుమార్లు నకిలీ విత్తనాలు అమ్ముతూ పట్టుబడిన వారి కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టాలని విజిలెన్స్‌శాఖ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ ఆదేశించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులను కాపాడేందుకు విజిలెన్స్ అధికారులు తీసుకుంటున్న పటిష్ఠ చర్యలపై మంగళవారం ఆయన సమీక్షించారు. రానున్న వ్యవసాయ సీజన్‌కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ప్యాకేజింగ్, నకిలీ లేబుల్స్ వంటి వాటిపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఒక్కో విజిలెన్స్ అధికారి తమ పరిధి జిల్లాల్లోని విత్తన కేంద్రాలు, వారి పరిధిలో ఇప్పటికే పట్టుబడిన నకిలీ విత్తన విక్రేతల వివరాలు తెప్పించుకోవాలని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలలో అవినీతికి తావులేకుండా చూడాలని తెలిపారు. విజిలెన్స్ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిల్లో పర్యటించాలని, తమ పరిధిలోని విభాగాల్లో ఎక్కడ అవినీతి జరిగినా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని డీజీ ఆదేశించారు.

నీరా, కల్లు ఉత్పత్తులకు ప్రోత్సాహం

- సీఎం దృష్టికి గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా పెంపు విషయం
- పర్యాటక ప్రాంతాలుగా తాటికొండ, ఖిలాస్‌పూర్, సర్వాయిపేట
- కల్లు సొసైటీ ప్రతినిధుల సన్మాన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు

సర్వాయి పాపన్న పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు జూపల్లి, పొన్నం, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): నీరాతోపాటు కల్లు ఉప ఉత్పత్తులను ప్రోత్సహించి, గీత కార్మికుల జీవనోపాధి పెంపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎక్సైజ్, పురావస్తు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాల పరిధిలోని కల్లు సొసైటీల ప్రతినిధుల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి జూపల్లి పాల్గొన్నారు. ప్రజలకు కల్తీలేని కల్లును అందించడానికి ఈత, తాటివనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని జూపల్లి చెప్పారు. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంపు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కల్లుగీత కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడ కులస్తుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఖిలాస్‌పూర్, తాటికొండ, సర్వాయిపేట కోటలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై త్వరలో సర్వాయి పాపన్న విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, కార్యనిర్వాహకులు టీ ప్రేమ్‌దాస్‌గౌడ్, సి.హరిచరణ్‌గౌడ్, ఎం కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 40 వేల కోట్లు కేటాయించాలి

- వ్యవసాయ శాఖ ప్రతిపాదన

బడ్జెట్ పద్దులపై జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.40 వేల కోట్లు కేటాయించాలని ఆ శాఖ కోరింది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో వివిధ శాఖల బడ్జెట్ పద్దులపై జరిగిన సమీక్షలో వ్యవసాయ శాఖ ఈ ప్రతిపాదన చేసింది. ఇందులో రైతుబంధు పథకం అమలుకు అవసరమైన నిధులను కూడా పొందుపర్చినట్టు అధికారులు తెలిపారు. వ్యవసాయ రుణ మాఫీకి మాత్రం ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని చెప్పారు. రుణమాఫీపై ప్రభుత్వ విధివిధానాలు ఇంకా ఖరారు కాకపోవడంతో బడ్జెట్‌లో ఎన్ని నిధులు కోరాలన్న దానిపై స్పష్టత లేదు. రుణమాఫీకి సంబంధించి కటాఫ్ తేదీపైనా అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.

5,300 కోట్లు కోరిన ఆర్టీసీ

బడ్జెట్‌లో టీఎస్ఆర్టీసీకి రూ.5,300 కోట్లు కేటాయించడంతోపాటు కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగుల నియామకానికి తోడ్పాటు అందించాలని ఆ సంస్థ ప్రతిపాదించింది. 'మహాలక్ష్మి' పథకం విజయవంతమయ్యేందుకు సహకరించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నెలా 1న జీతాలు అందేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఉద్యోగులకు సంబంధించిన బాండ్లు, పీఎఫ్, సీసీఎస్ బకాయిలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల సంఖ్య పెంచాలని కోరారు. కాగా, ఆర్టీసీలో ఖర్చులు తగ్గించుకోవాలని, ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని మంత్రి భట్టివిక్రమార్క సూచించినట్టు సమాచారం.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఆలయ సందర్శకుల సౌకర్యార్థం దేవాలయాలకు చెందిన ఖాళీ స్థలాల్లో కాటేజీలు నిర్మించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలకు చెందిన బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన మాట్లాడుతూ.. నాగోబా, మేడారం లాంటి గిరిజన జాతరలకు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయాలని తెలిపారు. పెద్దగా ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యం కోసం ఆర్థిక సాసహాయాన్ని అందించే పథకాన్ని మరింత సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీలను పునరుద్ధరించనున్నట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ సమావేశాల్లో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాయింట్ సెక్రటరీ హరిత, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి బీ వెంకటేశం, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, కమిషనర్ అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ సీసీఎఫ్ డోబ్రియల్, పర్యావరణ, అటవీ శాఖల ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పెయిన్ పర్యటనకు మంత్రి జూపల్లి

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో బృందం స్పెయిన్ పర్యటనకు బయలుదేరింది. బుధవారం నుంచి ఈ నెల 28 వరకు జరిగే ఎఫ్ఐటీయూఆర్ ఇంటర్నేషనల్ టూరిజం ట్రేడ్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు రాష్ట్ర బృందం స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కు చేరుకున్నది. అంతర్జాతీయ పర్యాటక, వాణిజ్య ప్రదర్శన విదేశాల పర్యాటక నిపుణుల వేదిక మాత్రమే కాదు.. ఎఫ్ఐటీయూఆర్ వాణిజ్య ప్రదర్శన కూడా. ప్రకృతి, పర్యావరణం, సాహసాలు, చారిత్రిక, ఆధ్యాత్మిక రంగాల్లో రాష్ట్రంలో టూరిజానికి ఉన్న అవకాశాలను తెలంగాణ బృందం ఈ ప్రదర్శనలో వివరించనున్నది. తెలంగాణ పర్యాటక విభాగాన్ని ఆదాయ వనరుగా మార్చడమే లక్ష్యంగా మంత్రి జూపల్లి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. పర్యటనలో పర్యాటక, సాంస్కృతికశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటకశాఖ డైరెక్టర్ కే నిఖిల, ఎండీ రమేశ్‌నాయుడు ఉన్నారు.